

# సైకియాట్రిక్ కథలు

లేబర్ రూంలో జలజ నొప్పులు పడుతోంది. ఆమె అత్తగారూ, భర్తా బయట ఆత్రతతో ఎదురుచూస్తూ కూచున్నారు. జలజ అడ్వర్టైజింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. మెటర్నిటీ లీవు వేస్ట్ చేసుకోడం ఇష్టం లేని జలజ డెలివరీ ముందు రోజు దాకా ఆఫీసుకి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. అందుకే ఆమె పురిటికి పుట్టింటికి వెళ్ళలేదు. ఆమె ఉద్యోగం మీద మోజున్న అత్తగారు పురుడు పొయ్యడానికి ఒప్పుకుంది.

జలజకి ఆడపిల్ల పుట్టింది. ఇంట్లో మహాలక్ష్మి వెలిసిందని ఆమె భర్తా, అత్తగారూ మురిసిపోయారు. జలజ ఆనందంతో పొంగిపోయింది.

హాస్పిటల్లో ఉన్న మూడు రోజులూ జలజ హాయిగానే ఉంది. ఇంటికి వచ్చాక

## తొలికాన్పు

కూడా సంతోషంగానే ఉంది. పది రోజులయ్యాక బారసాల చేసి జలజ ఇష్టప్రకారమే వీణ అని పేరు పెట్టారు.

అకస్మాత్తుగా జలజలో ఆందోళన మొదలైంది. ఆమె ఒకచోట కూచోలేకపోయింది. హాయిగా పడుకుని విశ్రాంతి తీసుకోలేకపోయింది. తన కూతుర్ని ఎవరైనా ఎత్తుకుపోతారేమోనన్న భయం ఆమెను పూర్తిగా ఆక్రమించుకుంది. తన చిన్నారి పాపకు ఎవరైనా విషం పెడతారనో, కత్తితో పొడుస్తారనో ఆమె భయపడసాగింది.

భయాలతోపాటు రకరకాల భ్రమలు కూడా ఆమెలో చోటు చేసుకున్నాయి. తనకి ఆడపిల్ల పుట్టలేదనీ, ఇద్దరు మగపిల్లలు కవలలుగా పుట్టారనీ ఆమె నమ్మడం ప్రారంభించింది.

''ఏమండీ, మనకి ఇద్దరు మగపిల్లలు పుట్టారుకదా. ఇక్కడ ఆడపిల్ల ఉందేమిటి?'' అని భర్తని అడిగింది జలజ.

''మనకి ఆడపిల్లే పుట్టింది జలజా'' భర్త ఓర్పుగా చెప్పాడు.

''లేదండీ..కన్నదాన్ని నాకు తెలుస్తుందా మీకు తెలుస్తుందా? మనకి మగపిల్లలే పుట్టారు. హాస్పిటల్లో మార్చేసి ఉంటారు''

''జలజా, మనకి ఆడపిల్లే పుట్టింది. హాస్పిటల్లో ఆరోజున ఎవరికీ మగపిల్లలు పుట్టలేదు.''

''అయితే ఎవరైనా ఈ కిటికీలోనుంచి వచ్చి పిల్లల్ని ఎత్తుకుపోయుంటారు''

జలజ భర్త విసుగ్గా వీధిలోకి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి జలజకి తన ఊహ తప్పని తెలిసింది. ఆమె చాలా బాధపడింది.

ఇంకోరోజు ఉదయం జలజ అత్తగారు పాపకి స్నానం చేయిస్తోంది. జలజ పరిగెత్తుకుంటూ వెళ్ళి పాపను లాక్కుని ''నా పిల్లని చంపేస్తున్నారు'' అని అరిచింది.

జలజ అత్తగారు నిర్ఘాంతపోయింది.

''ఆడపిల్ల పుట్టిందని మీకు కోపం. అందుకే చంపేస్తున్నారు''

జలజ అత్తగారి ముఖం అవమానంతో నల్లబడింది. ఏం చెయ్యాలో తెలియని జలజ భర్త జలజను పురుడుపోసిన గైనకాలజిస్టు దగ్గరకు తీసికెళ్ళాడు. ఆమె జలజను పరీక్షించి సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళమని చెప్పింది. సైకియాట్రిస్టు దగ్గరకు వెళ్ళేసరికే జలజకు తనే పాపను గాయపరుస్తుందేమోనన్న భయం పట్టుకుంది.

సైకియాట్రిస్టు జలజని పరీక్షించే ముందుగా ఆమె భర్తను ఒక ప్రశ్న అడిగింది.

''ఆడపిల్ల పుట్టిందని మీరు ఎవరూ ఆమెను నిందించలేదు కదా''

''లేదు డాక్టర్. మా ఇంట్లో మహాలక్ష్మి వెలిసిందని సంతోషించాం తప్ప. ఆమెను మేమేమీ అనలేదు. మా అందరికీ ఆడ అయినా, మగ అయినా సమానమే''

సైకియాట్రిస్టు జలజతో మాట్లాడింది. జలజలో తనకు మగపిల్లలు కవలలు పుట్టారనీ, తన పాపను ఎవరైనా చంపేస్తారనీ రకరకాల భ్రమలు ఉన్నాయి. ఆమెలో ఆందోళన, తికమకపడ్డం, తప్పుచేశానన్న భావం చోటు చేసుకున్నాయి. ఆమె తనను కానీ, పాపను కానీ పట్టించుకునే స్థితిలో లేదు. జలజ డిప్రెషనుతో కానీ, స్కిజోఫ్రెనియాతో కానీ బాధపడడం లేదని డాక్టరు నిర్ణయించింది.

అకస్మాత్తుగా జలజలో ఆందోళన మొదలైంది. ఆమె ఒకచోట కూచోలేకపోయింది. హాయిగా పడుకుని విశ్రాంతి తీసుకోలేకపోయింది. తన కూతుర్ని ఎవరైనా ఎత్తుకుపోతారేమోనన్న భయం ఆమెను పూర్తిగా ఆక్రమించుకుంది.

ప్రసవమన్నది స్ట్రెస్‌తో కూడిన పని. జీవితంలో ఏదైనా స్ట్రెస్‌తో కూడిన సంఘటనలు ఎదురైనప్పుడు ఒక వ్యక్తిలో భ్రమలూ, ఆందోళన, భావోద్వేగం వంటివి ఏర్పడతాయి. జలజలో ప్రసవమయ్యాకనే ఈ లక్షణాలు మొదలయ్యాయి. ప్రసవానికి ముందు జలజ మామూలుగానే ఉండేది. జలజ పోస్ట్‌పార్టం సైకోసిస్‌తో బాధపడుతోందని డాక్టరు నిర్ధారించి, విషయాన్ని జలజ కుటుంబ సభ్యులకు చెప్పింది. రెండో కాన్పు తరవాత కూడా జలజలో భ్రమలు చోటు చేసుకుంటాయని తెలియచేసింది.

''లోకంలో ఆడవాళ్ళందరూ పురుడు పోసుకుంటున్నారు. నా కోడలికే ఇలా అవాలా నా ఖర్మ'' అంది జలజ అత్తగారు విసుగ్గా.

సైకియాట్రిస్టు సానుభూతిగా చూసింది ''మీరు చెప్పింది కొంత నిజమే. ప్రసవమైన వెయ్యిమందిలో ఒక్కరికే పోస్ట్ పార్టమ్ సైకోసిస్ వస్తుంది. అయితే పది శాతం వరకూ స్త్రీలకి మేజర్ డిప్రెషన్ ప్రసవం తర్వాత కలుగుతుంది. నూటికి ఎనభైదాకా ఆడవాళ్ళకి ఎంతోకొంత చిరాకూ, ఏడుపూ ఉంటాయి. ఆ పరిస్థితిని బేబీ బ్లూస్ అంటారు. సాటి స్త్రీగా మీ కోడల్ని ఆదరించండి''

''దీనికి ట్రీట్‌మెంట్ లేదా?'' అడిగాడు జలజ భర్త.

సైకియాట్రిస్టు జలజకి ఆంటీసైకోటిక్ మందులు రాసి ఇచ్చింది. ఒకటి, రెండు వారాలకి జలజలో భ్రమలన్నీ తొలిగిపోయాయి. కొన్ని వారాలయ్యాక జలజలో తిరిగి భ్రమలు చోటుచేసుకున్నాయి. డాక్టరు మళ్ళీ మందు లిచ్చింది. మందులు వాడిన జలజ పూర్తిగా మామూలు మనిషైంది.

ప్రసవానంతరం ఎంతోకొంత మానసిక బలహీనత స్త్రీలలో చోటు చేసుకోవడం సామాన్యం. ముఖ్యంగా మొదటికాన్పు తర్వాత స్త్రీ జీవితం పూర్తిగా మారిపోతుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నశించిన నేటి కాలంలో స్త్రీకి పని రెట్టింపవుతుంది. ఆ సమయంలో ఆమెకు మానసికంగా కుటుంబ సభ్యుల అండదండలు అవసరం.

**-పాలంకి సత్య**

★

